క్లుప్తంగా

ముమ్మరంగా చెరుకు క్రషింగ్

సదాశివనగర్(ఎల్లారెడ్డి): అడ్లూర్ఎల్లారెడ్డి గాయత్రి షుగర్స్ ఫ్యాక్టరీలో చెరుకు క్రషింగ్ ముమ్మరంగా కొనసాగుతుంది. సోమవారం నాటికి 2 లక్షల 11 వేల 945 టన్నుల క్రషింగ్ జరిగినట్లు ఫ్యాక్టరీ వైస్ ప్రెసిడెంట్ వేణుగోపాల్ రావు తెలిపారు. పర్మిట్ల ఆధారంగా చెరుకును గానుగకు తరలిస్తున్నట్లు పేర్కొన్నారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి



భిక్కనూరు: ప్రతి ఒక్కరూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుంటే ఆరోగ్యంగా ఉండవచ్చని భిక్కనూరు ప్రభుత్వ ఆస్పత్రి వైద్యులు యెమిమా అన్నారు. మంగళవారం జంగంపల్లిలోని జ్యోతిబాపూలే గురుకుల పాఠశాలలో సమాచార హక్కు చట్ట పరిరక్షణ కమిటీ ఆధ్వర్యంలో విద్యార్థినులకు వైద్య శిబిరం నిర్వహించారు. సమాచార హక్కు చట్టం పరిరక్షణ కమిటీ రాష్ట్ర డైరెక్టర్ ఎంఏ సలీం, డాక్టర్ చంద్రశేఖర్, వైద్యులు పుట్ట మల్లికార్జున్, సమాచార హక్కు చట్ట పరిరక్షణ కమిటీ జోనల్ అధ్యక్షుడు సిర్నాపల్లి ప్రదీప్ కుమార్, ప్రిన్సిపాల్ మణిదీప్తి పాల్గొన్నారు.

భవిత సెంటర్‌ను ఉపయోగించుకోవాలి



నస్రుల్లాబాద్(బాన్సువాడ): మండల కేంద్రంలోని భవిత సెంటర్‌ను దివ్యాంగ చిన్నారులు ఉపయోగించుకోవాలని ఎంఈవో నాగేశ్వర్ రావు అన్నారు. విద్యార్థులు ఇంటి వద్ద చేయాల్సిన వ్యాయమాలను మంగళవారం డాక్టర్ మనీషా చేసి చూపించారు. భవిత సెంటర్ తరపున వికలాంగ విద్యార్థికి వీల్ చైర్‌ను అందించారు. సర్పంచ్ అరిగె సాయిలు, స్థానిక నాయకులు లక్ష్మీనారాయణ గౌడ్, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

కూలీల సంఖ్య పెంచాలి



నస్రుల్లాబాద్(బాన్సువాడ): ఎంపీడీవో కార్యాలయంలో మంగళవారం పంచాయతీ కార్యదర్శులతో ఎంపీడీవో సుబ్రహ్మణ్యం రివ్యూ సమావేశం నిర్వహించారు. ఉపాధి కూలీలకు పని కల్పించడం కోసం పనుల్ని గుర్తించాలన్నారు. కార్యక్రమంలో ఎంపీవో రాము, పంచాయతీ కార్యదర్శులు నవీన్, మానస, ముఖీద్, రజిత, భారతి, సాయిలు, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి

బిచ్కుంద(జుక్కల్): మహిళలు వంట గదికే పరిమితం కాకుండా మహిళలు, బాలికలు అన్ని రంగాల్లో రాణించాలని మహిళా సాధికారత అధికారి తులసి అన్నారు. మంగళవారం బిచ్కుందలో మహిళలతో సమావేశం ఏర్పాటు చేసి బేటి బచావో బేటీ పడావో కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. జాతీయ బాలికల దినోత్సవం సందర్భంగా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో పలు కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. ప్రభుత్వం బాలికల రక్షణ కోసం చేపడుతున్న కార్యక్రమాలు, చదువు ప్రాముఖ్యత, నైపుణ్యం, సఖి కేంద్రాలు, బాల్య వివాహాలు, హెల్ప్ లైన్ ఫోన్ నెంబర్లు తదితర అంశాలపై మహిళలకు అవగాహన కల్పించారు. సీడీపీవో సునంద, సూపర్‌వైజర్ కొమురవ్వ ఉన్నారు.

స్టోన్ క్రషర్‌కు విద్యుత్ సరఫరా నిలిపివేత?

బాన్సువాడ రూరల్: మండలంలోని సోమేశ్వర్ గ్రామ శివారులో గల పీఎస్ఆర్ స్టోన్ క్రషర్ అండ్ మిక్సింగ్ ప్లాంట్‌కు విద్యుత్ సరఫరా నిలిపివేసినట్లు తెలిసింది. గత కొన్నేళ్లుగా విద్యుత్ బిల్లులు చెల్లించకపోవడంతో విద్యుత్ బకాయి రూ.60 లక్షలకు చేరింది. సామాన్యులు నెల బిల్లు పెండింగ్ పెడితే కనెక్షన్ కట్‌చేసే ట్రాన్స్‌కో అధికారులు రూ.60 లక్షలు బకాయి చేరే వరకు విద్యుత్ సరఫరా కొనసాగించడంపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఈవిషయమై ట్రాన్స్‌కో ఏఈ వివరణకు ఫోన్‌లో ప్రయత్నించగా అందుబాటులోకి రాలేదు.

యూనిఫామ్స్ వితరణ



కామారెడ్డి టౌన్: శ్రీ సాయి చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో మంగళవారం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు యూనిఫామ్స్ వితరణ చేశారు. అలాగే పాఠశాలలకు రెండు ఫ్యాన్స్ అందజేశారు. కార్యక్రమంలో డీఈవో ఎస్.రాజు, ట్రస్ట్ అధినేత ఎంజీ చక్రవర్తిగౌడ్, సభ్యులు భరత్, శ్రీనివాస్, నర్సింలు, రవీందర్‌రావు, రాజేందర్‌లున్నారు.

బిల్లులు అందేదెప్పుడు?

- ఐదు నెలలుగా అందని మధ్యాహ్న భోజన బిల్లులు
- ఇబ్బందులు పడుతున్న నిర్వాహకులు
- పట్టించుకోని అధికార యంత్రాంగం



మద్నూర్‌లో వంట చేస్తున్న మధ్యాహ్న భోజన సిబ్బంది

మద్నూర్(జుక్కల్): సర్కార్ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెంచేందుకు ప్రభుత్వం మధ్యాహ్న భోజన పథకాన్ని తీసుకొచ్చింది. విద్యార్థులకు ప్రతి రోజు భోజనం వండి పెడుతున్న కార్మికులు వంట బిల్లులు రాక, వేతనాలు అందక అష్టకష్టాలు పడుతున్నారు. ఆగస్టు నుంచి మధ్యాహ్న భోజనం వంట బిల్లులు, సెప్టెంబర్ నుంచి సీఎం బ్రేక్‌ఫాస్ట్ బిల్లులు, కోడిగుడ్డు బిల్లులు, ఏడు నెలల నుంచి గౌరవ వేతనాలు చెల్లించకపోవడంతో అప్పులు చేసి మరీ విద్యార్థులకు వండి పెడతున్నామని వంట నిర్వాహకులు వాపోతున్నారు.

ఇదీ పరిస్థితి..

మద్నూర్ ఉమ్మడి మండలంలో మొత్తం 56 పాఠశాలలు ఉన్నాయి. ఇందులో ప్రాథమిక పాఠశాలలు 34, ప్రాథమికోన్నత పాఠశాలలు 13, ఉన్నత పాఠశాలలు 9 ఉన్నాయి. ఇందులో 5,686 మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. కేవలం 1 నుంచి 8వ తరగతి వరకు ప్రభుత్వం ఇంత వరకు బిల్లులు చెల్లించలేదు. ఆయా పాఠశాలల్లో మధ్యాహ్న భోజన కార్మికులు 112 మంది ప్రతిరోజు వంట చేస్తున్నారు. 6 నుంచి 8వ తరగతి విద్యార్థులకు రూ.8.17, 1 నుంచి 5వ తరగతి విద్యార్థులకు రూ.5.45 చొప్పున ప్రభుత్వం అందిస్తుంది. కానీ సకాలంలో బిల్లులు చెల్లించకపోవడంతో ఐదు నెలల నుంచి వంట బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయి. వీటితో పాటు ఇటీవల సీఎం బ్రేక్‌ఫాస్ట్ పేరుతో ఉదయం టిఫిన్ కోసం ఒక్కో విద్యార్థికి రూ.10.50 చెల్లిస్తామని ప్రభుత్వం ప్రకటించినా ఇప్పటి వరకు కూడా టిఫిన్ బిల్లులు సైతం అందలేదని కార్మికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వంట సామగ్రిని కిరాణ దుకాణంలో ఉద్దర తీసుకొస్తున్నామని, బిల్లులు లేకపోవడంతో సరుకులు కూడా ఇవ్వడం లేదని వాపోతున్నారు. వేతనాలు, బిల్లులు చెల్లించడంతో పాటు ప్రస్తుతం రేట్ల ప్రకారం బిల్లులు పెంచాలని వారు కోరుతున్నారు.

అప్పులు చేస్తున్నాం



మూడు నెలల నుంచి మధ్యాహ్న భోజనం బిల్లు రాలేదు. దీంతో కిరాణ షాపు యాజమాని కూడా పాత బిల్లు చెల్లిస్తేనే సరుకులు ఇస్తామంటున్నారు. దీంతో చేసేదేమి లేక వడ్డీకి డబ్బులు తెచ్చి సరుకులు కొనుగోలు చేస్తున్నాం.

–రుక్మిణి, నిర్వాహకురాలు, మద్నూర్

అధికారులకు తెలియజేశాం



మధ్యాహ్న భోజన కార్మికులకు బిల్లులు రాలేదన్న విషయాన్ని జిల్లా అధికారులకు తెలియజేశాం. 1 నుంచి 8వ తరగతి వరకు మధ్యాహ్న భోజన బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయి. కార్మికులు పడుతున్న ఇబ్బందులను ప్రభుత్వం, ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం.

–రాములు, ఎంఈవో, మద్నూర్

కాంగ్రెస్‌లో చేరిన రెండో వార్డు కౌన్సిలర్

- బీఆర్ఎస్‌ను వీడుతున్న మున్సిపల్ కౌన్సిలర్లు



కాంగ్రెస్‌లో చేరుతున్న కౌన్సిలర్ రవి

కామారెడ్డి టౌన్: కామారెడ్డి మున్సిపల్‌లో బీఆర్ఎస్ పార్టీకి వరుసగా షాక్‌లు తగులుతున్నాయి. ఆ పార్టీకి చెందిన కౌన్సిలర్లు ఒక్కొక్కరిగా రాజీనామా చేస్తూ కాంగ్రెస్ పార్టీ తీర్థం పుచ్చుకుంటున్నారు. తాజాగా మంగళవారం 2వ వార్డు కౌన్సిలర్ సుతారి రవి సైతం బీఆర్ఎస్‌కు రాజీనామా చేసి కాంగ్రెస్‌లో చేరారు. రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు, మాజీ మంత్రి షబ్బీర్ అలీ సమక్షంలో చేరగా ఆయనకు కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో డీసీసీ అధ్యక్షుడు కైలాస్ శ్రీనివాసరావు, నాయకులు ఉర్దొండ రవి, భీంరెడ్డి, రవీందర్ గౌడ్, జమీల్, పంపరి లక్ష్మణ్, గోనె శ్రీనివాస్, కిరణ్, ఉరుదొండ ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

ఇప్పటి వరకు బీఆర్ఎస్‌కు చెందిన మున్సిపల్ కౌన్సిలర్లు 12 మంది కాంగ్రెస్‌లో చేరారు. దీంతో బల్దియాలో కాంగ్రెస్ కౌన్సిలర్ల బలం 16కు చేరుకుంది. మరి కొందరిని పార్టీలో చేర్చుకుని బీఆర్ఎస్ చైర్‌పర్సన్ నిట్టు జాహ్నవిపై అవిశ్వాసం పెట్టెందుకు కాంగ్రెస్ సిద్ధమవుతున్నట్లు తెలిసింది. బీఆర్ఎస్, బీజేపీల నుంచి మరో 10 మంది కౌన్సిలర్లు కాంగ్రెస్‌లో చేరే అవకాశాలు ఉన్నట్లు ప్రచారం జరుగుతోంది. 10వ వార్డు కౌన్సిలర్ ఉర్దొండ వనిత చైర్‌పర్సన్ రేసులో ఉన్నట్లు ప్రచారం జరుగుతోంది.

కాంగ్రెస్‌లో బీఆర్ఎస్ యువజన నేత

భిక్కనూరు: మండల కేంద్రానికి చెందిన బీఆర్ఎస్ యువజన నాయకుడు ఇస్కానిపేట రాజు మంగళవారం షబ్బీర్ అలీ సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. ఈ సందర్భంగా షబ్బీర్ అలీని కాంగ్రెస్ మండల మహిళ నాయకురాలు ఇస్కానిపేట సుశీల శాలువాతో సత్కరించారు.

మెనూ ప్రకారం భోజనం అందించాలి



భోజనాన్ని పరిశీలిస్తున్న జెడ్పీటీసీ మనోహర్‌రెడ్డి

నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): ప్రతిరోజూ మెనూ ప్రకారం విద్యార్థులకు మధ్యాహ్న భోజనం అందించాలని నాగిరెడ్డిపేట జెడ్పీటీసీ సభ్యుడు మనోహర్‌రెడ్డి సూచించారు. గోపాల్‌పేట మోడల్‌స్కూల్‌లో మంగళవారం విద్యార్థులకు అందిస్తున్న భోజనాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో ఆయన మాట్లాడారు. నెలరోజులుగా భోజనంలో గుడ్డు పెట్టడంలేదని విద్యార్థులు జెడ్పీటీసీతో చెప్పారు. ఈ విషయంపై ఏజెన్సీ నిర్వాహకుడిని ఆయన ప్రశ్నించారు. బిల్లులు సకాలంలో అందకపోవడం వల్ల విద్యార్థులకు గుడ్డు పెట్టడం లేదని ఏజెన్సీ నిర్వాహకుడు తెలిపారు. ఆయన వెంట ఏఎంసీ చైర్మన్ కిష్టయ్య, ప్రిన్సిపాల్ శ్రీలత ఉన్నారు.

భూముల రిజిస్ట్రేషన్‌ను సద్వినియోగం చేసుకోవాలి



డాక్యుమెంట్లను అందజేస్తున్న తహసీల్దార్ క్రాంతి

నిజాంసాగర్(జుక్కల్): భూముల క్రయవిక్రయాలు, రిజిస్ట్రేషన్ల ప్రక్రియను రైతులు సద్వినియోగం చేసుకోవాలని మహమ్మద్‌నగర్ తహసీల్దార్ క్రాంతికుమార్ సూచించారు. మంగళవారం స్థానిక తహసీల్ కార్యాలయంలో మొట్ట మొదటి రిజిస్ట్రేషన్ చేపట్టి, రైతులకు డాక్యుమెంట్లను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కొత్తగా ఏర్పాటైన మహమ్మద్‌నగర్ తహసీల్ కార్యాలయంలో రిజిస్టేషన్లు ప్రారంభం కావడం సంతోషంగా ఉందన్నారు. 3 నెలల తర్వాత కొత్త మండలంలో రిజస్టేషన్ల ప్రక్రియ జరుగుతుందని రైతులు సహకరించాలని కోరారు. గున్కుల్ సొసైటీ చైర్మన్ వాజిద్ అలీ, నాయకులు దఫేదార్ విజయ్, రామాగౌడ్, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

జాబ్‌మేళా విజయవంతం



మాట్లాడుతున్న ఇంటర్ నోడల్ అధికారి

ఎల్లారెడ్డి: ఎల్లారెడ్డి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మంగళవారం నిర్వహించిన జాబ్‌మేళా విజయవంతమైందని కళాశాల ప్రిన్సిపల్ హేమచందర్ తెలిపారు. హెచ్‌సీఎల్ టెక్‌బీ కంపెనీ ప్రతినిధులు నిర్వహించిన జాబ్‌మేళా కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఇంటర్ నోడల్ ఆఫీసర్ షేక్ సలాం హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కలెక్టర్ జితేష్ వి పాటిల్ ప్రత్యేక చొరవ తీసుకుని జాబ్ మేళాలు నిర్వహిస్తున్నారన్నారు. అనంతరం హెచ్‌సీఎల్ కంపెనీ ఏరియా ప్రతినిధి రాజేష్ మాట్లాడుతూ జాబ్‌కు ఎంపికైన వారికి ఏడాది పాటు సాఫ్ట్‌వేర్ రంగంలో శిక్షణ ఇస్తామని, అనంతరం ఉద్యోగం కల్పిస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ హేమచందర్, సిబ్బంది శ్రీనివాస్‌చారి తదితరులు పాల్గొన్నారు.

వాయిదా మీరిన బకాయిలను వసూలు చేయాలి



సమావేశమైన విండో పాలకవర్గం సభ్యులు

భిక్కనూరు: సింగిల్ విండోలో తీసుకున్న దీర్ఘ, స్వల్పకాలిక రుణాలు తీసుకున్న రైతులు వాయిదా మీరి చెల్లించకపోతే నోటీసులు ఇచ్చి కచ్చితంగా బకాయిలు వసూలు చేయాలని భిక్కనూరు సింగిల్ విండో పాలకవర్గం సభ్యులు తీర్మానించారు. మంగళవారం విండో అధ్యక్షుడు గంగ్గళ్ల భూమయ్య అధ్యక్షతన పాలకవర్గం సభ్యులు సమావేశమయ్యారు. రైతులకు అవసరమైన ఎరువులు, విత్తనాలను విండోలో అందుబాటులో ఉంచాలని తీర్మానించారు. ఇటీవల మృతి చెందిన విండో సభ్యుడు సింగాడపు నారాయణ కుటుంబానికి రూ.3 వేల ఆర్థిక సహాయం అందజేశారు. విండో వైస్ చైర్మన్ ముచ్చర్ల రాజిరెడ్డి, డైరెక్టర్లు పెద్దబచ్చగారి మైపాల్‌రెడ్డి, బచ్చగారి నర్సింలు, మానుకొండ తదితరులు పాల్గొన్నారు.

ఓటర్ జాబితాలో తప్పులుండొద్దు



మద్నూర్‌లో మాట్లాడుతున్న తహసీల్దార్



మాట్లాడుతున్న ప్రిన్సిపల్ ప్రవీణ్ కుమార్

మద్నూర్(జుక్కల్): ఓటరు జాబితాలో తప్పులను జాగ్రత్తగా సవరించాలని తహసీల్దార్ ముజీబ్ పేర్కొన్నారు. స్థానిక తహసీల్ కార్యాలయంలో మంగళవారం బూత్ లెవల్ అధికారులతో ఆయన సమావేశం నిర్వహించారు. ఓటర్ జాబితాలో డూప్లికేట్ ఓట్లను జాగ్రత్తగా తొలగించాలని సూచించారు.

గణతంత్ర వేడుకలపై సమావేశం

మండల కేంద్రంలోని తహసీల్ కార్యలయంలో మంగళవారం వివిధ శాఖల అధికారులతో గణతంత్ర వేడుకలపై తహసీల్దార్ ముజీబ్ సమావేశం నిర్వహించారు. గణతంత్ర వేడుకలను అన్ని ప్రభుత్వ కార్యలయాల వద్ద ఘనంగా నిర్వహించాలన్నారు. సీనియర్ అసిస్టెంట్ విజయ్, ఆర్ఐ శంకర్, ముస్తఫా, బాలరాజు తదితరులున్నారు.

ఓటు హక్కును వినియోగించుకోవాలి

ఎల్లారెడ్డిరూరల్(ఎల్లారెడ్డి): ఓటు పొందిన యువకులు ఓటు హక్కును సక్రమంగా వినియోగించుకోవాలని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ ప్రవీణ్ కుమార్ అన్నారు. మంగళవారం డిగ్రీ కళాశాలలో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. మొదటి సారి ఓటు హక్కు వచ్చిన విద్యార్థులు ఓటును అమ్ముకోవద్దని సూచించారు. అసిస్టెంట్ ప్రొఫెసర్లు జయప్రకాష్, ప్రభాకర్, అధ్యాపకులు కృష్ణప్రసాద్, సిద్ధురాజ్, గంగారెడ్డి ఉన్నారు.

ఐకేపీ సమావేశంలో..

రాజంపేట: రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో ప్రతి ఒక్కరూ తమ అమూల్యమైన ఓటు హక్కును వినియోగించుకువాలని ఐకేపీ డీపీఎం రమేష్ బాబు అన్నారు. మంగళవారం సుతారి లక్ష్మి అధ్యక్షతన మండల మహిళా సమాఖ్య సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. ఈ సందర్భంగా మహిళల ఆరోగ్యంపై సభ్యులకు అవగాహన కల్పించారు. బాలికల జాతీయ దినోత్సవం సందర్భంగా ఐసీడీఎస్ శారదా మాట్లాడుతూ.. లింగ సమానత్వం, బాల్య వివాహాలు, ఆరోగ్యం, మహిళలపై జరిగే అన్యాయాల గురించి సభ్యులకు అవగాహన కల్పించారు. ఏపీఎం సాయిలు, సీసీలు శ్రీనివాస్, సాయిలు, బాగయ్య, తదితరులు పాల్గొన్నారు.

నేడు మండల సర్వసభ్య సమావేశం

బాన్సువాడ రూరల్: మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం ఎంపీపీ నీరజా వెంకట్రాంరెడ్డి అధ్యక్షతన సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీవో సత్యనారాయణరెడ్డి తెలిపారు. ఉదయం 11 గంటలకు సమావేశం ప్రారంభం అవుతుందని మండలంలోని 25 గ్రామ పంచాయితీల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, అన్నిశాఖల మండల అధికారులు హాజరై విజయవంతం చేయాలని కోరారు. ప్రగతి నివేదికలు కార్యాలయంలో సమర్పించని అధికారులు సమావేశం ప్రారంభానికి ముందే అందజేయాలని కోరారు.

ఘనంగా నేతాజీ జయంతి



జిల్లా కేంద్రంలో సుభాష్ చంద్రబోస్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న బీజేపీ నాయకులు

స్వాతంత్య్ర సమరయోధుడు, నేతాజీ సుభాష్ చంద్రబోస్ జయంతిని జిల్లా వ్యాప్తంగా మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటాలు, విగ్రహాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ.. స్వాతంత్య్రం కోసం పోరాడిన మహనీయుడు సుభాష్ చంద్రబోస్ అని కొనియాడారు. ఆయన దేశానికి చేసిన సేవలను స్మరించుకున్నారు. ఈ సందర్భంగా స్థానిక నాయకులు మిఠాయిలు పంచిపెట్టారు. – సాక్షి నెట్‌వర్క్



తాడ్వాయిలో..



రామారెడ్డిలో..



బాన్సువాడలో తపస్ ఆధ్వర్యంలో..



భిక్కనూరులో.. కాంగ్రెస్ నేతలు



దేవునిపల్లిలో..



తిమ్మనగర్ ప్రాథమికోన్నత పాఠశాలలో..



సంగం పాఠశాలలో..



నాగిరెడ్డిపేటలో..



జిల్లా కేంద్రంలో హిందూవాహిని ఆధ్వర్యంలో..



ఎల్లారెడ్డిలో..



దోమకొండలో.. వినాయక లక్ష్మీనర్సింహ సిండికేట్ సభ్యులు



సోమేశ్వర్ ప్రభుత్వ పాఠశాలలో..



బాన్సువాడ ప్రభుత్వ డిగ్రీకళాశాలలో..

విగ్రహాల ఆవిష్కరణ

సదాశివనగర్(ఎల్లారెడ్డి): అడ్లూర్ ఎల్లారెడ్డిలో మంగళవారం నేతాజీ సుభాష్ చంద్రబోస్ విగ్రహాన్ని సర్పంచ్ పైడి జానకి జనార్దన్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. స్వాతంత్య్ర సాధనే తన జీవిత ధ్యేయంగా తపించిన భరతమాత ముద్దు బిడ్డ నేతాజీ సుభాస్ చంద్రబోస్ అని పేర్కొన్నారు. పరాక్రమ దివస్ సందర్భంగా మహనీయుడికి ఘన నివాళులర్పించారు. ఉప సర్పంచ్ లక్ష్మీపతి, ఎంపీటీసీ ఎడ్ల రేణుకా నర్సింలు, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు మహేందర్ రెడ్డి, మండల మాజీ కో–ఆప్షన్ మెంబర్ ఇర్షాదొద్దిన్, తదితరులు పాల్గొన్నారు.

దమ్ము చక్రాలతో రోడ్లు పాడు చేయొద్దు

- ఏఎంవీఐ గిజ్జా శ్రీనివాస రావు



నిజాంసాగర్(జుక్కల్): పట్టీలు లేకుండా దమ్ము చక్రాల వాహనాలను రోడ్లపై నడపడం వల్ల ధ్వంసమవుతున్నాయని అసిస్టెంట్ మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ గిజ్జా శ్రీనివాస్ రావు అన్నారు. మంగళవారం జుక్కల్, బిచ్కుంద మండలాల్లో జాతీయ రహదారి మాసోత్సవాలపై డ్రైవర్లకు అవగాహన కల్పించారు. రహదారుల అభ్యున్నతి కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రూ.కోట్లు మంజూరు చేస్తున్నాయన్నారు. రహదారుల భద్రతకు వాహనాల డ్రైవర్లు తమ వంతు సహకారం అందించాలని కోరారు.